TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 243 | మంగళవారం 25-08-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

# తెలంగాణపై ఏంటీ వివక్ష?

## గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. నన్ను అడ్డుకుంటారా?: సీఎం రేవంత్ రెడ్డి



- అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ
- గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చారని వ్యాఖ్య
- ఇది తెలంగాణ ప్రజలకు అవమానం: రేవంత్
- కేంద్రం తీరుపై రాజకీయ వివక్ష ఆరోపణ
- పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించే కుట్ర: సీఎం
- అమెరికా పర్యటనకు అన్ని వివరాలు ఇచ్చామని వెల్లడి
- 'రాజకీయ కారణం' అంటే ఏమిటని ప్రశ్న
- డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు
- కేంద్ర నిర్ణయాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని వెల్లడి
- తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని ఖండించాలని పిలుపు

హైదరాబాద్: వికసిత్ భారత్ లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 పేరిట పెట్టుబడుల ఆకర్షణకు తలపెట్టిన తన అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి(జవీ =వఝుత్ష్ర =వఽఎఎ) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు.

2లో

## విదేశాల్లో తలదాచుకున్న గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం

- అమిత్ షా



- మలేషియాలో ముగ్గురు గ్యాంగ్‌స్టర్లు అరెస్ట్
- జస్‌ప్రీత్, అజయ్, పవన్‌దీప్ సింగ్‌లుగా గుర్తింపు
- బంబీహా గ్యాంగ్‌తో సంబంధాలు
- బెదిరింపులు, ఆయుధాలు, డ్రగ్స్ కేసులు
- లూథియానా గ్రనేడ్ దాడి కుట్రలోనూ ప్రమేయం
- ఈ ఏడాది 51 మంది నేరస్థుల అప్పగింత
- విదేశాల్లో దాక్కున్న నిందితులపై చర్యలు

2లో

దేశంలో కుట్రలకు పాల్పడి విదేశాల్లో తలదాచుకున్న నిందితులపై భారత్ ఉక్కుపాదం మోపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షాఅన్నారు. దేశం విడిచి పారిపోయిన ముగ్గురు గ్యాంగ్‌స్టర్లను మలేషియాలో పట్టుకున్న దర్యాప్తు ఏజన్సీలు భారత్‌కు తీసుకొచ్చిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

## పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం



2లో

- పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న దాహార్తి
- రూ. 280 కోట్ల నిధుల కేటాయింపు
- 96 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి
- గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా

## శాఖల్లో సమర్థత -- సేవల్లో నాణ్యత

### సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం డేటా ఇంటిగ్రేషన్

- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం




**అమరావతి, ఆగస్ట్ 24 :** ఏఐ అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్ చెయిన్... వంటి సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ సేవలు మరింత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబంధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికేట్స్ అప్‌లోడ్ చేసే పని లేకుండా డేటా ఇంటిగ్రేషన్ జరగాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ సమీక్షలో వివిధ శాఖల పనితీరు, పురోగతి గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలు మరింత సమర్ధత పెంచుకోవాలని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

**క్రాప్ అలర్ట్‌లపై పర్యవేక్షణ**

ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో పంటల పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈసారి వ్యవసాయ దిగుబడులు సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందించగలమని చెప్పారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సమృద్ధిగా నీరందించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే సాగు మొదలు పెట్టని చోట వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలని నిర్దేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు క్రాప్ అలర్ట్ పంపడంతో పాటు దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇందుకోసం ఏపీటీఎస్ అనలిటిక్స్ కూడా వినియోగించుకుని... అవేర్‌తో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. తాగునీటి వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. అటు మలేరియా, డెంగీ కేసుల నివారణకు హాట్ స్పాట్ లు గుర్తించి, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

2లో

## రామచందర్‌రావుకు పొన్నం ప్రభాకర్ కౌంటర్



- చేతనైతే కేంద్రం నుంచి నిధులు సాధించండి
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మొసలి కన్నీరు వద్దు
- పాత బకాయిలను విడతల వారీగా చెల్లిస్తున్నాం
- ఈ ఏడాది నుంచి అడ్వాన్స్ పేమెంట్‌కు చర్యలు
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉందా?

2లో

## 22ఏ భూముల అంశంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు: మంత్రి పొంగులేటి

- 22ఏ భూముల విషయంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు
- బాధితులకు న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ
- 22ఏ జాబితా, వివిధ ఆర్డర్ల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- రిలాక్సేషన్ వచ్చిన భూముల సమస్యలు క్లియర్ చేశాం
- ఈనెల 18 నుంచి టోల్‌ఫ్రీ 1162కు 1,162 కాల్స్
- వచ్చిన ఫిర్యాదులను జిల్లాల వారీగా అధికారులకు పంపిణీ
- ప్రైవేటు ఆస్తుల కంటే ప్రభుత్వ ఆస్తుల సమస్యలే ఎక్కువ
- నిలిచిపోయిన 22ఏ రిజిస్ట్రేషన్లు 24 గంటల్లో క్లియర్




హైదరాబాద్: 22ఏ భూముల అంశంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని.. వారికి న్యాయం చేస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతి సోమవారం జిల్లా అధికారులతో దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలో ఉన్న వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. రిలాక్సేషన్ వచ్చిన వాటిని క్లియర్ చేశాం. మేడ్చల్‌లోని భూదాన్ భూముల్లోని వాటిని తిరస్కరించాం. ఈనెల 18 నుంచి టోల్‌ఫ్రీ నంబర్‌కు 1162 కాల్స్ వచ్చాయి. టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన కాల్స్‌ను జిల్లాల వారీగా పంపించాం. ప్రైవేటు ఆస్తులవి కాకుండా ప్రభుత్వ ఆస్తుల సమస్యలే ఎక్కువ. 22ఏకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన వాటిని 24 గంటల్లో క్లియర్ చేశాం. ఎక్కడైనా ఒకట్రెండు ఆగిపోతే పరిష్కరిస్తాం.. ఆందోళన అవసరం లేదు" అని పొంగులేటి తెలిపారు.

- ఎక్కడైనా ఒకట్రెండు సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం
- ప్రతి సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నాం

## మద్యం కుంభకోణానికి కేరాఫ్ అడ్రస్ తాడేపల్లి ప్యాలెస్

### దోపిడీ కోసమే మద్యం పాలసీ మార్పు



2లో

- బలహీన వర్గాల నేతలను బలిపశువులను చేశారు
- తప్పులు బయటపడటంతో రాజకీయ కక్షలంటూ ఎదురుదాడి
- మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం

**మంగళగిరి, ఆగష్టు 24 :** గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన మద్యం కుంభకోణం దేశంలోనే అతిపెద్ద స్కామ్‌లలో ఒకటని గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మద్యపాన నిషేధం పేరిట అధికారంలోకి వచ్చి, వేల కోట్ల రూపాయలు దోచుకోవడానికి వీలుగా విధానాలను రూపొందించారని విమర్శించారు. మద్యం తయారీ నుంచి రవాణా వరకు ప్రతి దశలోనూ దోపిడీకి పాల్పడ్డారని మండిపడ్డారు.

## నాపై నిఘా పెట్టారు.. ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు



2లో

## మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు: కాకినాడ ఎస్పీ



2లో

# సంపాదకీయం

## ఇప్పటికీ అంతే కొత్త పాళీ!

తాపీ ధర్మారావు తన జీవితంలో ఒక మూడేళ్ళపాటు ఒక్క ముక్క రాయలేదు. ఆ కాలం గురించి ఆయన ఇలా రాసారు: "...పూర్వపు రీతినే వ్రాసివేద్దామంటే, నా హృదయంలో కలిగిన మార్పు దానికి ఒప్పుకునేది కాదు. అందుచేత మౌనం కలిగింది నా కలానికి. దీనివల్ల స్నేహితులయిన పత్రికా సంపాదకులకి నాపై కోపం కూడా కలిగింది ఏమి చేయను? నాపై నాకే కోపం కలిగినపుడు ఇతరులకి కలగదా!..."

1933 నుంచి 1936 మధ్య ఆ మూడేళ్ళ కాలంలోనూ చేసినదేమిటో కూడా ఆయన రాసుకున్నారు: "మూడు సంవత్సరాలు--వెయ్యిరోజులు--దాటిపోయాయి. ఒక్క ముక్క అయినా వ్రాయలేదు... ప్రచురించడం అంతకన్నా లేదు. నిజమే, కాని, చదివినది మాత్రం చాలా ఉంది. దగ్గరదగ్గర 40, 50 వేల పేజీల సారస్వతం చదవగలిగాను. సారస్వతం అంటే ఎలాంటి సారస్వతం? ...దేశదేశాలలోనూ, ఖండఖండాలలోనూ ప్రఖ్యాతి పొందిన గ్రంథాలు. వందలకొద్ది ఇతర భాషలలోకి తర్జుమా అయిన గ్రంథాలు, అన్ని జాతులవాళ్ళ పొగడ్తల్నీ, లక్షలకొద్దీ బహుమానాన్నీ పొందిన గ్రంథాలు. ప్రపంచంలోని జనులనీ, వాళ్ళ అభిప్రాయాలనీ ఒక్కసారి మార్చివేసిన గ్రంథాలు. రషియా, జర్మనీ, నార్వే, స్వీడను, ఫ్రాన్సు, ఇంగ్లండు, అమెరికా... ఈ దేశాలలో మిక్కిలి ఉత్తమమైన గ్రంథాలు. ఈ గ్రంథాలు కరువుదీర చదివాను. నా స్వభావాన్నిబట్టి చదివిన వాటిని గురించి విమర్శించుకున్నాను. ఆలోచించుకున్నాను. తరువాత ఆయా దేశాల్లో ఆ గ్రంథాలను గురించి విమర్శనలు చూశాను. నోబెల్ మొదలైన గొప్ప గొప్ప బహుమానాలు ఈ గ్రంథాలకెందుకిచ్చారో తెలుసుకున్నాను. దీని అంతటివల్ల నా అభిప్రాయాలు చాలా ఎక్కువగా మారిపోయాయి. మారక తప్పదు ఆ గ్రంథాలని చూచిన తర్వాత."

ఈ మాటలన్నీ తాపీ ధర్మారావు పుస్తకం 'కొత్తపాళీ'లోని తొలి పేరాలు. రాయకుండా గడిపిన మూడేళ్ళ తర్వాత గూడవల్లి రామబ్రహ్మం నడిపిన 'ప్రజామిత్ర' పత్రికలో 1936 సంక్రాంతి సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురింపబడిన ధర్మారావు వ్యాసాలే 'కొత్తపాళి' సంపుటి. అప్పటికి ధర్మారావు వయసు నలభైకు మించలేదు. ఆయన్ను వ్యావహారిక భాషా వైతాళికుడిగా మనం కొనియాడుతాం. ఘనమైన పత్రికా సంపాదకుడిగా గౌరవిస్తాం, తెలుగు సినిమాలకు చక్కని భాషను, స్క్రీన్ ప్లే విధానాన్ని ఇచ్చిన దార్శనికుడిగా కీర్తిస్తాం. అయితే తెలుగు సాహిత్య విమర్శకుడిగానూ ఆయన పేరు గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉంది.

ఇటీవల మళ్ళీ వారి రచనలు 'ఇనుప కచ్చడాలు', 'దేవాల యాలపై బూతు బొమ్మలు', 'సాహిత్య మొర్మరాలు', 'పాత పాళీ', 'కొత్తపాళీ' పుస్తకాలను జాగ్రత్తగా చదివాను. సాహిత్య విమర్శను కూడా బొరుగులు తిన్నంత సులువుగా అందివ్వగలిగిన ప్రతిభాశాలి తాపీ. 'కొత్తపాళీ' గురించి చాలామంది రాశారు, శ్లాఘించారు, తాపీవారికి పర్యాయపదంగా వాడారు. అయినా ఇప్పటికీ తెలుగు పాఠకులు 'కొత్తపాళీ'ని కొత్తగా, సమగ్రంగా, సవ్యంగా చూడాల్సి ఉందనే అనిపిస్తోంది.

నిజానికి తాపీధర్మారావు 'కొత్తపాళీ' ద్వారా సాహిత్యరచనకు ఒక సిలబస్ రూపొందించారు. ఏది సాహిత్యం? ఎవరి కోసం ఆ సాహిత్యం? దాని ఉద్దేశ్యం ఏమిటి? ఎలా రాయాలి? అలానే ఎందుకు రాయాలి? -- అనే విషయాలపట్ల సమగ్రమైన అవగాహన కలిగిస్తారు. అలాగే కవి లేదా రచయిత నిల్చున్న కాలానికీ, సమయానికీ -- గతాన్నీ, గత సాహిత్యాన్ని ఎలా చూడాలి? ఏమి స్వీకరించాలి? అలాగే భవిష్యత్తులో బాధ్యత ఏమిటి? అని కూడా చాలా సులువుగా బోధపడేట్టు విశ్లేషిస్తారు.

సాహిత్య విమర్శకుడిగా ధర్మారావులో పాండిత్యం, విశ్లేషణ, ఓపిక విశేషంగా ఉన్నాయి. అంతకుమించి వారి విమర్శలో మనం చూడాల్సినవి మరిన్ని ఉన్నాయి: అ) సాహిత్య విమర్శను రీడబుల్‌గా రాయడమూ, ఆ) హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, వెటకారాన్ని పుష్కలంగా వాడటమూ, ఇ) ఎటువంటి ద్వేషం లేకుండా సహనం, సమన్వయంతో కూడిన దృష్టితో సాహిత్య పరిశీలన చేయడమూ, ఈ) హేతుబద్ధంగా ఏది ప్రయోజనకరమో, కాదో అని విశ్లేషించి చూపడమూ, ఉ) తెలుగునూ, తెలుగు సాహిత్యాన్ని నెత్తిన పెట్టుకు అవి మరింత ఉజ్జ్వలంగా ఉండాలనడమూ -- వెరసి నవనవోన్మేషంగా తెలుగు సాహిత్య విమర్శకు కొత్తచూపు ఇవ్వడమూ.

ఈ వ్యాసాలను 1955లో పుస్తకంగా వెలువరిస్తూ ఇలా అన్నారు: "...నాకు సంస్కృతం మీద ద్వేషమని కొందరయ్యలంటూంటారు. కాదు: నాకు కావాలి సంస్కృతం, కొద్దో గొప్పో ఇప్పటికీ చదువుకుంటుంటాను. అది గొప్ప రత్నాల గని. నిజమే. ఇష్టమున్నవాళ్ళు సంస్కృతం చదవవలసిందే, దానిలో ఉన్న విజ్ఞానం తెలుసుకోవలసిందే, ఆ విజ్ఞానాన్ని తెలుగులోనికి తీసుకురావలసిందే. అది కూడదనను. అనవసరంగా ఆ భాషను దిగుమతి చేయకండంటాను. తెలుగుతనం నిలుపమంటాను. అంతే..."

అలాగే కొత్తపాళీ చివరి వ్యాసం చివరలో ఇలా అంటారు: "...సాహిత్యాన్ని పట్టి ఆ జాతి వారి విజ్ఞానము, జీవన విధానము, ఆచారాలు, సంస్కృతి తెలుసుకోవడానికి వీలుండాలి. సాహిత్యంలో జాతి కనబడాలి. జాతికి సాహిత్యం అద్దంలాగుండాలి." "తెలుగు కవి, తెలుగు రచయిత, తెలుగు ప్రజల జీవితంలో ఉండి వ్రాయాలి... తెలుగు సంస్కృతీ, తెలుగు గడ్డా, యుగయుగాల నుంచి వచ్చిన తెలుగు విజ్ఞానమూ తనకిచ్చిన శక్తీ, అతను తెలుగు ప్రజకి రుణపడి ఉన్నాడు. ఆ రుణం తీర్చాలి; తన ఇష్టం వచ్చినట్టు వినియోగించుకోకూడదు. మళ్ళీ తెలుగువాళ్ళకు తాను కొంత చెల్లించాలి," అని కూడా చెప్తారు తాతాజీ.

ఈ క్లారిటి చూడండి: "...అందులో సంస్కృతమే ఉండనీయండి, తెలుగే ఉండనియ్యండి, ఇంగ్లీషు, హిందూస్తానీ మరేదయినా ఉండనీయండి. ఏమైనాసరే తెలియడం ప్రధానం..." అంటారు. 1936లో రాసిన మాటలు నేటికీ చాలామందికి ఎంతో అవసరమనిపిస్తుంటుంది -- కొన్ని సమయాలలో వినిపించే వాదనల రొద వింటూంటే!

వారి 'కొత్తపాళీ' వ్యాసాల నుంచి కొన్ని పదునైన వాక్యాలు, పరిశీలనలు:

1) తెనుగు చేస్తానని చెప్పి, మరింత సంస్కృతం గుప్పి తెలియకుండా చేయడం అక్రమం, తన పాండిత్యం ప్రదర్శించడానికే వ్రాసుకొనడమే అంటుంది మొల్ల-- నన్నయ గురించి.

2) జాను తెలుగు కోసమూ, ద్విపదల కోసమూ, తెలుగు ప్రజల గాథల కోసమూ చూచేవాళ్ళు కొంతమంది ఉండేవాళ్ళు -- నన్నెచోడుడు, పాలకురికి సోమనాథుడు మొదలైన వాళ్ళు. వీళ్ళ పేర్లే మొన్న మొన్నటిదాకా మనకు తెలియకుండా పోయాయి.

3) కవిసమయాలన్నారు, సాహిత్యసూత్రాలన్నారు, కావ్యమర్యాదలన్నారు, నాటకలక్షణాలన్నారు, వెయ్యిపేర్లు చెప్పారు. పదివేల నియమాలు దింపారు... ఇవన్నీ సంస్కృతం రేవులో నుంచే దిగుమతి.

4) పగలు కలువపువ్వులు వికసించి ఉండటం ఎంతమంది చూచారు కాదు? అవి కలువలు కావంటారా?

5) తెలుగులో తెలుగు సాహిత్యాన్ని చూపాలి. సంస్కృతం పరిచయం వల్ల మరింత అభివృద్ధి పొందడానికి బుద్ధిపుట్టాలి. గాని బానిస బుద్ధి పుట్టిపోకూడదు.

6) కృష్ణరాయ చక్రవర్తినీ, ఆతని ఆముక్తమాల్యదా చూడండి. ఆ ఊహాచాతురీ ఆ ప్రపంచ పర్యావలోకనమూ, ఆ కవిత్వదృష్టీ చూచినవాళ్ళకి అతడు గ్రుడ్డి వ్రాతగాడు కాక, ఒక నూరు కళ్ళున్న వ్రాతగాడిలా కనిపిస్తాడే!

7) పేరుగాంచిన ప్రబంధాలని మనం కొంచెం జాగ్రత్తగా చూడాలి. వాటిని కేవలం పారవేయకూడదు. అలా పారవేసినట్టయితే ఆంధ్రసారస్వత జీవనంలో మూడు, నాలుగు వందల సంవత్సరాలు వ్యర్థమయిపోయినట్టే అవుతుంది. అంత నష్టానికి ఎవరు ఒప్పుకోగలరు?

8) గ్రంథాలలో స్త్రీ పురుష సాంగత్య విషయంలోని సంగతులన్నీ మడికట్టుకుని విడిచిపెడితే బాగుండదు.

# పాపాల ఫలితమే కారుమూరి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, ఆగష్టు 24 :**
గత ప్రభుత్వంలో చేసిన పాపాల ఫలితమే మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్ అని, ఇది కక్షసాధింపు కాదని ఎమ్మెల్యే గల్లా మాధవి స్పష్టం చేశారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈడీ చేపట్టిన చట్టబద్ధమైన చర్యలకు కులం, కక్ష రంగు పూయడం అర్థరహితమని మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో అవినీతి నిర్ణయాల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

**మద్యం కుంభకోణంలో కీలక పాత్ర**

గత ప్రభుత్వంలో మద్యం అక్రమ రవాణా, విక్రయాల్లో కారుమూరి నాగేశ్వరరావు ప్రధాన పాత్ర పోషించారని గల్లా మాధవి ఆరోపించారు. ఈ కుంభకోణంలో ఆయన కుటుంబానికి కోర్టులు కూడా బెయిల్ నిరాకరించిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో చట్టం నిష్పక్షపాతంగా తన పని తాను చేసుకుపోతోందని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటుంటే కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయడం సరికాదని పేర్కొన్నారు.

**ప్రజలను మభ్యపెట్టే యత్నం**

వైసీపీ నాయకులకు న్యాయస్థానాలు, రాజ్యాంగ వ్యవస్థల పట్ల ఏమాత్రం గౌరవం లేదని ఆమె విమర్శించారు. చేసిన తప్పుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, రాజకీయ ముసుగులో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

# మద్యం కుంభకోణానికి కేరాఫ్ అడ్రస్ తాడేపల్లి ప్యాలెస్

మొదటిపేజీ తరువాయి

**చట్టం ముందు అందరూ సమానమే**

అవినీతికి పాల్పడింది ఎవరైనా చట్టం ముందు సమానమేనని మంత్రి స్పష్టం చేశారు. దోచుకున్న ప్రజాధనాన్ని ఫేక్ కంపెనీలు, డెన్‌ల ద్వారా ఎన్నికల్లో ఖర్చు చేశారని తెలిపారు. పక్కా ఆధారాలు ఉండటం వల్లే న్యాయస్థానాలు నిందితులకు బెయిల్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి దర్యాప్తు సంస్థలపై రాజకీయ కక్షలంటూ ఎదురుదాడి చేయడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని తెలిపారు.

**బలహీన వర్గాలను పావులుగా వాడుకున్నారు**

స్వార్థ ప్రయోజనాల కోసం బీసీ, ఎస్సీ, మైనారిటీ నాయకులను పావులుగా వాడుకుని చివరకు వారిని బలిపశువులను చేశారని ఆరోపించారు. ఎటువంటి నేర చరిత్ర లేని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వంటి వారిని మద్యం దోపిడీలోకి లాగారని తెలిపారు. లూటీ చేసిన ప్రజాధనాన్ని రియల్ ఎస్టేట్, విదేశీ మైనింగ్ వ్యాపారాలకు తరలించారని మంత్రి పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# తెలంగాణపై ఏంటీ వివక్ష?

మొదటిపేజీ తరువాయి

గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు.

### భాజపా నేతలు నా పర్యటనపై తప్పుదోవ పట్టించారు!

లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భాజపా నేతల తీరును ప్రశ్నించారు. "రాష్ట్రాలకు కేంద్రం సహకరించకపోవడం మన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యలో సహకారం, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా పర్యటన తలపెట్టాను. బ్రిటన్‌కు అనుమతించి.. అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించింది. పెట్టుబడులు సాధన కోసం గతంలోనూ విదేశాలకు వెళ్లాం. కానీ ఈసారి లండన్‌కు అనుమతించి అమెరికా వెళ్లకుండా చేశారు. కేంద్రం వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ శ్రేణులతో పాటు విద్య, క్రీడల విధానాలు, పెట్టుబడుల విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా యువతకు మేలు జరుగుతుందని నమ్మే వారంతా తప్పుబట్టారు. విదేశాంగ శాఖ నా పర్యటనను తిరస్కరించడంతో పాటు భాజపా నేతలు కొందరు నా పర్యటన వివరాలపై తప్పుదారి పట్టించేలా, వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నా అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పి తప్పుదోవ పట్టించారు.

### 'రాజకీయ కారణం' అంటే ఏమిటి?

నా విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యత లేదు. ఈ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలూ స్పష్టంగా పేర్కొన్నాం. విద్య, క్రీడలు, రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పాం. యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలు ఇచ్చాం. నా పర్యటన మొత్తం షెడ్యూల్‌ను విదేశాంగ శాఖ ముందు ఉంచాం. కానీ, రాజకీయ కారణాల వల్ల అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణంతో అనుమతి ఇవ్వడంలేదని విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణం అంటే ఏమిటీ? బ్రిటన్ పర్యటనకు ఓకే చెప్పి.. అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారు. నేను తెలంగాణ సీఎంను.. కాంగ్రెస్ సీఎంను కావడమే కారణమా? ఒక సీఎం విదేశాలకు వెళ్తే విదేశీ రాయబారులు వెంటే ఉంటారు. ప్రతి కార్యక్రమాన్నీ వారు పర్యవేక్షిస్తారు.

### నన్ను అడ్డుకున్నా.. లక్ష్యాన్ని అడ్డుకోలేరు

కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా.

### మోదీ పాక్ వెళ్లొచ్చు.. మేం అమెరికా వెళ్లకూడదా?

నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్‌ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉంది.

### తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని ఖండించాలి

తెలంగాణ సీఎంకు అనుమతి నిరాకరించడం అంటే ఒక వ్యక్తిగా రేవంత్ రెడ్డికి ఎదురైన నిరాకరణ కాదు.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం.. తిరస్కరణ. ఈ తిరస్కరణకు కారణం గుజరాత్ ఆధిపత్యం. రాజకీయ కారణాలు చూపించి అనుమతి నిరాకరించడాన్ని తెలంగాణ సమాజం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరముంది. తెలంగాణ సీఎంను అమెరికా వెళ్లకుండా అడ్డుకోవడమంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. రాష్ట్రం పట్ల కేంద్రం స్పష్టమైన వివక్షను చూపిస్తోంది. ఇది ఏమాత్రం సహించరానిది. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి" అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పులివెందుల తాగునీటి పథకానికి
# పునరుజ్జీవం

మొదటిపేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు 24 (సదా మీకోసం):**



జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రాధాన్యమిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులను వేగవంతం చేశారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ పథకం గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి నాయకులు చేసిన ప్రయత్నాలతో కేంద్రం జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్లు పొడిగించింది. దీంతో ఈ పథకానికి దాదాపు రూ. 280 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేశారు.

పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతుండగా, పులివెందుల పట్టణంలో పనులు 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలంలో 24 ఆవాసాలకు త్వరలో నీరందనుంది. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయింది. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

# విదేశాల్లో తలదాచుకున్న గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

నిందితులు బంబీహా ముఠాతో సంబంధాలు కలిగిన జస్‌ప్రీత్ సింగ్, అజయ్ సింగ్, పవన్‌దీప్ సింగ్‌లుగా తెలిపారు. వీరిపై పలు తీవ్రమైన నేరాల ఆరోపణలు ఉన్నాయని షా పేర్కొన్నారు. బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కేసుల్లో నిందితులుగా ఉన్నారని వెల్లడించారు.

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 51 మంది కరడుగట్టిన నేరస్థులను విదేశాల నుంచి భారత్‌కు రప్పించినట్లు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో సురక్షిత, భద్రమైన భారత్ లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. పంజాబ్‌లోని లూథియానాలో జరిగిన గ్రనేడ్ దాడి కుట్రలోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

# మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు: కాకినాడ ఎస్పీ

మొదటిపేజీ తరువాయి

కాకినాడ: ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ రెండింటిలోనూ రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్‌ఖాన్ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొనడంతో అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.

"ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరిలో దూకారు. రియాన్స్ ప్రాణాలతో బయటపడగా మిగిలిన ముగ్గురు మృతిచెందారు. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. నూకరాజు వద్ద, సౌజన్య స్కూటీలో రెండు సూసైడ్ నోట్‌లు దొరికాయి. మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు. ఆమె మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పీఎస్‌లో కేసు నమోదు చేశాం. నిందితుడు సాధిక్‌ఖాన్ కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాం. చివరికి యూపీలోని మేరఠ్‌లో అతడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేశాం. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై కాకినాడ తీసుకొచ్చాం.

**5 రోజుల్లో 4 రాష్ట్రాల్లో సాధిక్ మకాం**

నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారై మేరఠ్ చేరుకున్న సాధిక్.. స్నేహితులకు మాయమాటలు చెప్పి ఆశ్రయం పొందాడు. ఫోన్, డబ్బు పోయినట్లు వారికి చెప్పాడు. అతడిపై వస్తోన్న మరికొన్ని ఆరోపణలపై విచారణ జరుగుతోంది. నిర్ధారణ అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తాం. హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద సాధిక్‌పై కేసులు నమోదు చేశాం. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తాం. కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతాం. కస్టడీలో ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. సామూహిక ఆత్మహత్య ఘటనకు ముందు బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు అండగా ఉంటారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు" అని ఎస్పీ కోరారు.

**సాధిక్‌ఖాన్‌కు 14 రోజుల రిమాండ్**

సాధిక్‌ఖాన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం కాకినాడ సబ్‌జైలుకు సాధిక్‌ఖాన్‌ను తరలించారు. నిందితుడిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ సర్పవరం పోలీసులు కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

# నాపై నిఘా పెట్టారు.. ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

నిజామాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తన కదలికలపై నిఘా ఉంచేందుకు.. తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన ఓ ఏసీపీ స్థాయి అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్' వేదికగా సోమవారం ఆరోపణలు చేశారు. డీజీపీ సీవీ ఆనంద్ సమర్థమైన అధికారి అని పేర్కొంటూనే.. పోలీసు వ్యవస్థ పనితీరుపై ఎంపీ పలు ప్రశ్నలు సంధించారు. 'తెలంగాణ పోలీస్ శాఖ రాజ్యాంగం, చట్టబద్ధమైన ఆదేశాల ప్రకారం పనిచేస్తోందా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు నడుచుకుంటోందా?' అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ రాజకీయ కుటుంబాలకు కాకుండా చట్టానికి జవాబుదారీగా ఉండాలని అర్వింద్ పేర్కొన్నారు.

# శాఖల్లో సమర్థత -- సేవల్లో నాణ్యత

మొదటిపేజీ తరువాయి

అయితే గత ఏడాది ఇదే సమయానికి 1,361 డెంగీ కేసులు నమోదైతే... ఈ ఏడాది ఇప్పటికి 401 కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో కార్బన్ న్యూట్రల్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రెన్యువబుల్ ఎనర్జీపై ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. సోలార్ రూఫ్ టాప్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

# వైన్స్ బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయాలు అరికట్టాలి

- నిర్ణయిత రేటు కంటే అదనంగా వసూలు చేస్తున్న నిర్వాహకులు
- నిద్ర మత్తులో ఎక్సైజ్ అధికారులు
- భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్
- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

సిరిసిల్ల/ ఆగస్టు 24 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కొన్ని వైన్ షాపుల యజమాన్యం సిండికేట్ విధానంలో బెల్ట్ షాపులకు వారికి మద్యం సరఫరా చేసే సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణయిత రేటు కంటే ఒక్క క్వాటర్ మద్యం సీసా పై సుమారు రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారని, అదే అలుసుగా భావించి గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వాహకులు పది రూపాయలకు అదనంగా 20, లేదా 30 రూపాయలు ఒక క్వాటర్,బీరు బాటిల్లపై గ్రామాల్లోని బెల్టు షాపులు నిర్వాహకులు మద్యం ప్రియుల నుండి వసూలు చేయడం జరుగుతుందని ఆరోపిస్తూ సోమవారం రోజున జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్ వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మద్యం విక్రయించాల్సి ఉండగా, వైన్స్ షాపుల, బెల్ట్ షాపుల, నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మద్యం ప్రియుల నుండి వినియోగదారుల నుంచి ఇష్టారాజ్యంగా అధిక డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి ఏర్పడిందని ,ఒక బీరు లేదా క్వార్టర్‌పై అదనంగా రూ.30--రూ.40 చెల్లించాల్సి రావడంతో కూలి పని చేసే వారు,రోజు వారి కూలి కార్మికులకు సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని అన్నారు,వైన్ షాపులు, బెల్ట్ షాపుల మధ్య జరుగుతున్న ఈ ధరల వ్యవహారం వైన్ షాపుల సిండికేట్ పై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలుస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు పర్యవేక్షణ లోపం గ్రామీణ ప్రాంత మద్యం ప్రియులకు శాపంగా మారిందని, జిల్లాలో ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై ప్రజలకు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఇప్పటికి అయినా ఎక్సైజ్ అధికారులు సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ



నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అలాగే జిల్లాలో మద్యం విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసే విధానం, వసూలు చేస్తున్న ధరలు, గ్రామాల్లో విక్రయిస్తున్న ధరలను పరిశీలించాలని ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేయకుండా చూడాలని . కూలి పేద మధ్యతరగతి సామాన్య కార్మిక కుటుంబాలను రోడ్ పాలు కాకుండా చూడాలని ఈ అంశంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత శాఖల అధికారులతో విచారణ చేయించి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ నాయకులు హరీష్ మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# తంగళ్ళపల్లిలో జాగిలాలతో పోలీసుల విస్తృత తనిఖీలు

- మాదక ద్రవ్యాల విక్రేతలపై కఠిన చర్యలు: ఎస్సై సిరిసిల్ల అశోక్
- పాన్, కిరాణా షాపుల్లో డాగ్ స్క్వాడ్‌తో సోదాలు

తంగళ్ళపల్లి మండలం / ఆగస్టు 24 ప్రజాదివాస్



తంగళ్ళపల్లి మండల కేంద్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం మండల కేంద్రంలోని పలు పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండలంలో నిషేధిత మాదక ద్రవ్యాలు, గంజాయి, గుట్కా వంటి పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సమాజంలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా స్థలాల పరిరక్షణ కోరుతూ ప్రజావాణిలో VHP వినతి

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 24

వేములవాడ పట్టణంలోని 11వ వార్డు పరిధిలో గల సర్వే నంబర్లు 1389, 1390, 1391లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన స్థలాలను పరిరక్షించాలని కోరుతూ సోమవారం మండల స్థాయి ప్రజావాణిలో విశ్వహిందూ పరిషత్ (ఎవ్హా) ఆధ్వర్యంలో వీణూ (అర్బన్) కీర్తనకు వినతిపత్రం సమర్పించారు.ఎవ్హా నాయకులు మాట్లాడుతూ, ఆయా సర్వే నంబర్లలో ఇప్పటికే మసీదు నిర్మాణం జరిగిందని, అలాగే లేఅవుట్‌లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలంలో షాదీఖానా నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, భూమి వినియోగం, లేఅవుట్ రికార్డులు తదితర అంశాలను రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు సమగ్రంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.నిబంధనలకు విరుద్ధంగా లేదా అవసరమైన అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాన్ని 11వ వార్డు ప్రజల ప్రయోజనార్థం ఓపెన్ జిమ్, పార్కు, గ్రంథాలయం ఏర్పాటు కోసం వినియోగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ అంశంపై గతంలో వేములవాడ మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించిన వినతిపత్రాల జిరాక్స్ ప్రతులను కూడా తాజా వినతిపత్రానికి జత చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎవ్హా పట్టణ




అధ్యక్షుడు పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి, కార్యదర్శి గుండు జి. గోపాల్, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, తిప్పర్తి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన స్థలాలు భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలకు అందుబాటులో ఉండేలా అధికారులు రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఎవ్హా నాయకులు కోరారు.

# మృతుల కుటుంబాలకు 50 వేల ఆర్థిక సాయం అందించిన ఆది కార్తీక్

- సర్పంచ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చేతుల మీదుగా సాయం అందజేత

రుద్రంగి మండలం / ఆగస్టు 24 ప్రజాదివాస్



చందుర్తి మండలం లింగంపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రుద్రంగికి చెందిన నలుగురు రక్తసంబంధీకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఊహించని దుర్ఘటనతో శోకసంద్రంలో మునిగిపోయిన బాధిత కుటుంబాలకు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తనయుడు కార్తీక్ 50,000/- ల ఆర్థిక సహాయాన్ని అందించి బాధిత కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలిచారు. ఈ ఆర్థిక సహాయాన్ని వేములవాడ ఏరియా ఆసుపత్రి వద్ద స్థానిక రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతిల చేతుల మీదుగా అందజేశారు. ఒకే కుటుంబంలో నలుగురు సొంత మనుషులను కోల్పోయిన కష్టకాలంలో అండగా నిలిచి తక్షణ సహాయం అందించిన ఆది కార్తీక్ సేవా దృక్పథాన్ని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తర్రే మనోహర్, పల్లి గంగాధర్, కామిరే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బద్ది పోచమ్మ ఆలయంలో ఈవో ఆకస్మిక తనిఖీలు

- అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు: ఆలయ ఈవో రమాదేవి హెచ్చరిక
- అస్వస్థతకు గురైన భక్తురాలికి సపర్యలు చేసిన ఈవో రమాదేవి

వేములవాడ / ఆగస్టు 24 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో ఆలయ ప్రాంగణాన్ని పర్యవేక్షించి, వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా క్యూలైన్లు, సీసీ రోడ్ల వద్ద ఏర్పాటు చేసిన షెడ్లను తనిఖీ చేసిన ఈవో, నిష్క్రమణ




(ఎగ్జిట్) ద్వారం గుండా ఎవరినీ లోపలికి అనుమతించవద్దని హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పట్నాలు వేసుకునే ప్రాంగణంలో భక్తులతో నేరుగా మాట్లాడి, సిబ్బంది ఎవరైనా అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అని ఆరా తీశారు. భక్తుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, ఆలయ పరిసరాలు 24 గంటలూ సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని హెచ్చరించారు. అలాగే భక్తులు సమర్పించిన ఒడి బియ్యం సంచులను స్వయంగా తనిఖీ చేశారు.దర్శన సమయంలో పూనకం వచ్చి నీరసించి పడిపోయిన ఒక మహిళా భక్తురాలిని గమనించిన ఈవో రమాదేవి, వెంటనే స్పందించి ఆమెకు తాగునీరు, అరటిపండ్లు అందించారు. అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అమ్మవారి దర్శనం చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ తనిఖీల్లో ఏఈవో లక్ష్మణరావు, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్, జూనియర్ అసిస్టెంట్ లింగయ్య, ఎస్పీఎఫ్ సిబ్బంది మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ వివరాలను ఈవో ఆదేశాల మేరకు ఆలయ పీఆర్ఓ పెరిక శ్రీనివాస్ వెల్లడించారు.

# లింగంపేట రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

ప్రమాద కారణాలపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశాలు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచన

చందుర్తి మండలం /ఆగస్టు 24 ప్రజాదివాస్



చందుర్తి మండలం లింగంపేట గ్రామ పరిధిలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సోమవారం అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ప్రమాదం జరిగిన పరిస్థితులు, రహదారి స్థితిగతులు, ఇతర సాంకేతిక అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రమాదానికి దారితీసిన ఖచ్చితమైన కారణాలను అన్ని కోణాల్లో పరిశీలించి, పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. దర్యాప్తును వేగవంతం చేసి, ప్రమాదానికి కారణమైన అంశాలను నిష్పక్షపాతంగా వెలికితీయాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అధిక వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని తెలిపారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి దేవాలయ పూజారి కమలాకర్ శర్మ

- హార్ట్ స్ట్రోక్ తో మరణం

ముస్తాబాద్ / ఆగస్టు 24 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ వాస్తవ్యులు కమలాకర్ శర్మ పంతులు గంభీరావుపేట మండలం మల్లారెడ్డి పేట గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజారిగా పని చేస్తుండేవారు కమలాకర్ శర్మ పంతులు ఆదివారం రోజున హార్ట్ స్ట్రోక్ తో మరణించడం జరిగింది. వారికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ సందు పట్ల అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, ముస్తాబాద్ మాజీ పట్టణ అధ్యక్షులు రాచమడుగు సంతోష్ రావు, ముస్తాబాద్ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి పార్టీ నాయకులు కోడె శ్రీనివాస్ తాళ్ల రాజు, తదితరులు పాల్గొన్నారు



# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్.. నిందితుడి అరెస్ట్, రిమాండ్...

**- అనుమతులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు: ఎస్సై శ్రీకాంత్...**

గంభీరావుపేట మండలం / ఆగస్టు 24 ప్రజాదివాస్



గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. మండలంలోని ముస్తఫానగర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి సుమారు 10:30 గంటల ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, ఇసుక లోడుతో వస్తున్న ఒక ట్రాక్టర్ (టీూ 23 ం 7673, ట్రైలర్ టీూ 23 ం 7674) కనిపించింది. పోలీసులు వెంటనే ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్‌ను విచారించారు. నర్మాల గ్రామానికి చెందిన ఒరగంటి ఎల్లయ్య (44) ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా, అనధికారికంగా ఇసుకను సేకరించి అధిక ధరలకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు తేలింది. దీంతో ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి, ఇసుకతో కూడిన ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఎల్లయ్యను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులో నిందితుడిని ఎస్ఐ శ్రీకాంత్ అరెస్టు చేసి సోమవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. గంభీరావుపేట మండలంలో ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం లేదా రవాణా చేయడాన్ని ఉపేక్షించేది లేదని ఎస్సై శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ...

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: డిఎంహెచ్ఓ డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్..**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 24 ప్రజాదివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని గరుడ, కోణార్క్ ఆసుపత్రులతో పాటు పలు ఇతర ఆసుపత్రులను ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 ప్రకారం విధిగా నడుచుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల వివరాలతో పాటు, రోగుల నుండి వసూలు చేసే ఫీజుల పట్టికను రేట్ల బోర్డును అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బయోమెడికల్ వేస్ట్ సర్టిఫికేట్, పొల్యూషన్ సర్టిఫికేట్‌లను కలిగి ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల పేర్లు, వారి అర్హతలకు సంబంధించిన వివరాల బోర్డును ఏర్పాటు చేయాలని, సిబ్బంది ధ్రువపత్రాలను తనిఖీ అధికారులకు విధిగా చూపాలని స్పష్టం చేశారు. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలకు (ఫైర్ సేఫ్టీ) సంబంధించిన పరికరాలను విధిగా అమర్చుకోవాలని ఆమె తేల్చిచెప్పారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ నాగేంద్ర బాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

**- ముస్తాబాద్ ఎంపీడీవో లచ్చాలు**



ముస్తాబాద్ / ఆగస్టు 24 ప్రజా దివాస్

ముస్తాబాద్ మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి 11 ఫిర్యాదులు అందాయని పంచాయతీరాజ్ శాఖ 2 హౌసింగ్ రెండు రెవెన్యూ శాఖ మూడు విద్యాశాఖ ఒకటి వ్యవసాయ శాఖ రెండు పశు వైద్యం ఒకటి మొత్తము 11 దరఖాస్తులు అందాయని కార్యక్రమానికి 18 శాఖల అధికారులు హాజరైనట్లు మండల ప్రజావాణి అధికారి లచ్చాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఫారుక్ ఎంపీడీవో ఎం ఏ ఓ అనూష డాక్టర్ అఫీజా, ఎంఈఓ, ఏఈ పి ఆర్, పశు వైద్య అధికారి, హౌసింగ్ పలువురు అధికారులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం మృతులకు నివాళులర్పించిన విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి. గీతే

**- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతితో విషాద ఛాయలు**

రుద్రంగి మండలం / ఆగస్టు 24 ప్రజాదివాస్

చందుర్తి మండలం లింగంపేట గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన షాదుల్లా కుటుంబం వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్తుండగా ప్రమాదానికి గురై, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రక్తసంబంధీకులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు. ప్రమాదంలో షాదుల్లాతో పాటు ఆయన భార్య హాసీనా, మరో కుటుంబ సభ్యురాలు హాసీనా, పదో తరగతి చదువుతున్న బాలిక మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి వారు మృతి చెందినట్లు తెలిపారు. సోమవారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం ప్రమాదాలకు కారణమవుతుందని, వాహనాలను జాగ్రత్తగా నడపాలని కోరారు. రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి నుంచి బయలుదేరిన ప్రతి ఒక్కరూ తమ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారనే



విషయాన్ని గుర్తుంచుకొని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఒకే ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం అత్యంత విషాదకరమని పేర్కొన్న విప్, మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# పొక్సో కేసులో నిందుతుడికి 05 సంవత్సరాల జైలు శిక్ష,2000/- రు.జరిమానా.

**- శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను, పీపీ లను, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ.**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 24 ప్రజాదివాస్

సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగ ప్రవర్తించిన (పోక్సో) కేసులో నిందుతుడికి 05 సంవత్సరాలు జైలు శిక్ష మరియు 2000/-రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ సోమవారం రోజున తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక డ్యాన్స్ అకాడమీ లో జంగ్లి రఘు అనే డ్యాన్స్ మాస్టర్ మైనర్ బాలికలతో అసభ్యకరంగ ప్రవర్తించగా, బాలికా యొక్క తల్లి ఫిర్యాదు మెరకు అప్పటి సిరిసిల్ల సీఐ ఉపేందర్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కి తరలించడం జరిగింది. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు



విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ జనార్దన్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 8 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి కె.జాన్సీ గారు వాదించగా, శాస్త్రీయ ఆధారాలు, సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన జంగ్లి రఘు కు 5 సంవత్సరాలు జైలు శిక్ష మరియు 2000/- జరిమాన విధించారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ, న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి సిరిసిల్ల సి.ఐ ఉపేందర్ , ప్రస్తుత సిరిసిల్ల సి.ఐ శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.జాన్సీ, కోర్టు మానిటరిశీగ్ ఎస్.ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ , కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్, ఏఎం కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, భరోసా సెంటర్ లీగల్ సపోర్ట్ పర్సన్ లహరిక లను జిల్లా ఎస్పీ అభినందిచారు..

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఐ డీ ఓ సీ ప్రజావాణికి 142 దరఖాస్తుల రాక**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 24 ప్రజదివాస్



ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 142 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 06 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 05 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

**మండలాల్లో స్వీకరణ**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓలు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

**మండలాల గా దరఖాస్తులు వివరాలు..**

బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 09, చందుర్తి మండలం 0, ఇల్లంతకుంట మండలం 10, గంభీరావుపేట మండలం 10, కోనరావుపేట మండలం 02, ముస్తాబాద్ 11, రుద్రంగి మండలం 02, తంగళ్లపల్లి మండలం 10, వీర్నపల్లి మండలం 07, వేములవాడ అర్బన్ మండలం 05, వేములవాడ రూరల్ మండలం 12, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 03 చొప్పున వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగు తుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన దర్యాప్తుతో నిందుతులకు వరుస శిక్షలు.

**ఆత్యాచార కేసులో నిందుతుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష,1000/- రు.జరిమానా.**

తంగళ్లపల్లి మండలం / ఆగస్టు 24 ప్రజాదివాస్

తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్లో నమోదైన ఆత్యాచారం కేసులో నిందుతుడీకి 10 సంవత్సరాలు జైలు శిక్ష మరియు 1000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల 1వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పుష్పలత గారు సోమవారం రోజున తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన జంగపల్లి శ్రీహరి అనే వ్యక్తి ఒక యువతిపై ఆత్యాచారానికి పాల్పడగా,అ యువతి ఫిర్యాదు మెరకు అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కి తరలించడం జరిగింది. అప్పటి సి.ఐ ఉపేందర్ దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేందర్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, వెన్నెల కోర్టులో 9 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి కె.జాన్సీ గారు వాదించగా,శాస్త్రీయ ఆధారాలు,సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన జంగపల్లి శ్రీహరి కు 10 సంవత్సరాలు జైలు శిక్ష మరియు 1000/- జరిమాన విధించారు.

ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి సిరిసిల్ల సి.ఐ లు సర్వర్ ,ఉపేందర్ ,ప్రస్తుత సి.ఐ నాగేశ్వరరావు,తంగళ్ల పల్లి ఎస్.ఐ అశోక్,పీపీ జాన్సీ,కోర్టు మానిటరిశీగ్ ఎస్.ఐలు రవీందర్ నాయుడు,శ్రవణ్ యాదవ్ ,కోర్టు కానిస్టేబుల్ రాజేందర్,ఎం కానిస్టేబుల్ నవీన్, వెన్నెల ను జిల్లా ఎస్పీ అభినందిచారు.



**సమర్థవంతమైన దర్యాప్తుతో నిందుతులకు వరుస శిక్షలు.**

జిల్లా పోలీసులు సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి, ప్రాసిక్యూషన్ సమన్వయంతో వేగవంతమైన విచారణ జరిపిస్తూ నిందితులకు వరుసగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు.నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, కఠిన శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# చందుర్తి పోలీస్ స్టేషన్ ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ మహేష్ బి.గితే..



చందుర్తి మండలం / ఆగస్టు 24 ప్రజాదివాస్

ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, పోలీస్ స్టేషన్ల పనితీరు,నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను నిరంతరం పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సోమవారం చందుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను అధికారులు బాధ్యతగా చట్టపరిధిలో పరిష్కరించాలని సూచించారు.సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా పారదర్శకంగా అందించాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ వలన కలుగు అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని, విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్పి వెంట డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ రవీందర్, ఎస్.ఐ రమేష్, సిబ్బంది ఉన్నారు.

# శ్రీ భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ: క్షేత్రస్థాయిలో ఈవో, డీఈవోల తనిఖీలు

**- భీమేశ్వర స్వామి భక్తులకు అసౌకర్యం కలగొద్దు: అధికారుల కఠిన ఆదేశాలు**
**- వేములవాడ: కోడె మొక్కుల ప్రాంగణంలో పటిష్ట భద్రత, అక్రమ వసూళ్లపై హెచ్చరిక**

వేములవాడ / ఆగస్టు 24 ప్రజాదివాస్

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారి సన్నిధికి సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి, డీఈవో నవీన్ కుమార్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యవేక్షించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రాంగణమంతా



కలియదిరిగిన అధికారులు ప్రధానంగా క్యూలైన్లు, డొనేషన్ కౌంటర్లను తనిఖీ చేశారు. క్యూలలో వేచి ఉన్న భక్తులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ.. కోడె మొక్కుల ప్రాంగణంలో రద్దీని క్రమబద్ధీకరించేందుకు వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కోడె కట్టే భక్తులు వెళ్లే ఎగ్జిట్ గేటు గుండా ఇతరులను ఎవరినీ లోపలికి అనుమతించవద్దని విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బందికి స్పష్టం చేశారు. ఆలయ ప్రాంగణంలో లేదా కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంలో భక్తుల వద్ద డబ్బులు డిమాండ్ చేసినా, అక్రమ వసూళ్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆలయ ఏఈవో జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది మరియు ఇతర ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ వివరాలను ఆలయ పీఆర్ఓ పెరిక శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్.. నిందితుడి అరెస్ట్, రిమాండ్...



**అనుమతులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు: ఎస్సై శ్రీకాంత్...**

గంభీరావుపేట మండలం / ఆగస్టు 24 ప్రజాదివాస్

గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. మండలంలోని ముస్తఫానగర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి సుమారు 10:30 గంటల ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, ఇసుక లోడుతో వస్తున్న ఒక ట్రాక్టర్ (టీఎస్ 23 ఎ 7673, ట్రైలర్ టీఎస్ 23 ఎ 7674) కనిపించింది. పోలీసులు వెంటనే ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్‌ను విచారించారు. నర్మాల గ్రామానికి చెందిన ఒరగంటి ఎల్లయ్య (44) ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా, అనధికారికంగా ఇసుకను సేకరించి అధిక ధరలకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు తేలింది. దీంతో ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి, ఇసుకతో కూడిన ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఎల్లయ్యను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులో నిందితుడిని ఎస్ఐ శ్రీకాంత్ అరెస్టు చేసి సోమవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. గంభీరావుపేట మండలంలో ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం లేదా రవాణా చేయడాన్ని ఉపేక్షించేది లేదని ఎస్సై శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజావాణిలో నవజ్యోతి ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

**- టీసీకి ఇచ్చేందుకు అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్**
**- పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి దారంసోత్ రవి నాయక్**

ముస్తాబాద్/ ఆగస్టు 24 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రం లోని గల నవజ్యోతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో సేవాలాల్ తండాకు చెందిన దారంసోత్ రవి నాయక్ అధికారులకు ఫిర్యాదు చేశారు.రవికి ఇద్దరు కుమారులు ముస్తాబాద్ లోని నవ జ్యోతి పాఠశాలలో గత సంవత్సరంలో ఒక విద్యార్థి ధరం సోత్ రోహిత్ ఐదవ తరగతి ధరం సోత్ రేవంత్ మరొక విద్యార్థి మూడవ తరగతి వరకు నవ జ్యోతి పాఠశాలలో చదివారని ఈ సంవత్సరం ఇతర ప్రాంతం కరీంనగర్ లో చదివిస్తున్నామని రవి





పేర్కొన్నారు.అయితే ఈ పాఠశాలకు చెల్లించవలసి నటువంటి ఫీజులు అన్నీ కూడా చెల్లించామని తమ పిల్లల ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ కోసం నవజ్యోతి పాఠశాలకు వెళ్లి యాజమాన్యాన్ని అడగగా అదనంగా ఒక్కొక్కరికి 500 రూపాయలు డబ్బులు చెల్లించాను డిమాండ్ చేశారు అదనంగా డబ్బులు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించగా విద్యార్థి తండ్రి పైన దురుసుగా ప్రవర్తించారని.ఒక్కొక్కరికి ఐదు వందల రూపాయలు చెల్లించి మీ ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్లు తీసుకెళ్లండని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం జరిగిందని పత్రికా ప్రకటనకు తెలియజేశారు. ప్రైవేట్ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తమ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని సంబంధిత అధికారులు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి పాఠశాల వసతులు ఫీజుల నియంత్రణ అర్హత కలిగిన ఉపాధ్యాయులు ప్రతి ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలని వారన్నారు

# రాజన్న సిరిసిల్ల జిల్లా రాచర్ల గొల్లపల్లిలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**- భార్యతో గొడవపడి పెట్రోల్ పోసుకున్న సత్యనారాయణ**

ఎల్లారెడ్డిపేట మండలం / ఆగస్టు 24 ప్రజాదివాస్

కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని కేసీఆర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగం సత్యనారాయణ అనే వ్యక్తి తన భార్యతో గొడవపడి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పటించుకున్నాడు. గమనించిన కాలనీవాసులు వెంటనే స్పందించి 108



వాహనానికి సమాచారం అందించారు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శానిటేషన్ మెరుగుపరిచి సీజనల్ వ్యాధులను అరికట్టాలి

**– చంద్రాలగూడెం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్**

ప్రజాదివాస్

కొత్తగూడెం :జిల్లాలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు.పాల్వంచ మండలము ఊళ్ళోనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల చంద్రాలగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలను డీఎంహెచ్ఓ పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అవసరమైన వారికి వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి, రోగులను పరీక్షించి, వారితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం, దోమల గుడ్లు లార్వాలు పెరగకుండా నివారణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యమన్నారు. ఇంటి పరిసరాల్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూల కుండీలు, ప్లాస్టిక్ డబ్బాలు, ఇతర నీరు నిలిచే వస్తువులను తొలగించాలని సూచించారు.మురికి కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి తొట్టెలు, డ్రమ్ములు తదితర నీటి నిల్వ ప్రదేశాలను మూతలతో భద్రపరచాలని తెలిపారు. వారానికి ఒకరోజు డ్రై డే పాటిస్తూ ఇంటి లోపల, బయట నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి తొలగించాలని సూచించారు.దోమల వృద్ధి అధికమైతే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా (బోదకాలు) వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, అతిసారం, జాండీస్, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు వంటి సీజనల్ వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జ్వరం, చలి, వణుకు, తీవ్రమైన తలనొప్పి, కీళ్ల నొప్పులు, శరీరంపై దద్దుర్లు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వారికి అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రేగళ్ల ఆకస్మిక తనిఖీ అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రేగలను డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, సిబ్బంది సమయపాలనతో విధులకు హాజరు కావాలని సూచించారు.అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందుతున్న చికిత్స, మందుల లభ్యత, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు తదితర



అంశాలను పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సమర్థవంతంగా అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య సిబ్బందికి సూచించారు. జ్వర కేసులను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహించి, వ్యాధులపై నిఘా కొనసాగించాలని ఆదేశించారు.పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యకరమైన గ్రామం అనే లక్ష్యంతో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ జిల్లా ఉపవైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ దేవేందర్ వైద్యాధికారి, దేవా, భీమ్సింగ్ , లక్ష్మీ, రాంరెడ్డి, గ్రామ సర్పంచులు, కార్యదర్శి పాల్గొన్నారు

2

# చిరుతపులి చర్మం, 17 గోర్ల అక్రమ విక్రయానికి యత్నం.. నలుగురు అరెస్ట్

ప్రజాదివాస్



చిరుతపులి చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురిని బూర్గంపహాడ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. తాళ్లగొమ్మూరు గ్రామంలో అనిల్ కుమార్ ఇంటి వద్ద అనుమానాస్పదంగా ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది.పోలీసుల వివరాల ప్రకారం.. గత వేసవిలో చింతూరు మండలం గమ్మలకోట సమీపంలోని అటవీ ప్రాంతంలో గుంతలో పడిపోయిన చిరుతపులిని నిందితులు రాళ్లు, కర్రలు, బాణాలతో కొట్టి చంపినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం చిరుత చర్మాన్ని తొలగించి ఎండబెట్టడంతో పాటు 17 గోర్లను భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.చర్మం, గోర్లను విక్రయించి డబ్బు సంపాదించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి ఒక చిరుతపులి చర్మం, 17 గోర్లు, ఒక చిన్న బ్యాగ్ స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు.అరెస్టయిన వారిలో చల్లా అనిల్ కుమార్ (తాళ్లగొమ్మూరు), కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్య (గమ్మలకోట, చింతూరు మండలం) ఉన్నారు.ఈ దాడుల్లో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు నాగ బిక్షం, ప్రవీణ్, సుమంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సు కోసం ఎంత దూరమైనా వెళతా: శాసనసభ్యులు పాయం

**– ఈ నెల చివరి వరకు ఎట్టి పరిస్థితుల్లో మీరేం చేస్తారో నాకు తెలియదు తుమ్మలచెరువులో మారేళ్లపాడు నీళ్లు పడాలి...శ్రీ**

**– రైతు శ్రేయస్సు కోసం ఎంత దూరమైనా వెళ్తా...**

**–మారేళ్లపాడు ఎత్తిపోతల పనులు మరింత వేగవంతం చేయాలి...**

**– రాత్రి పగలు అనే తేడా లేకుండా ప్రాజెక్టు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ....**

**– అధికారులను ఇటు పార్టీ శ్రేణులను ఉరుకులు పరుగులు పెట్టిస్తు మారెళ్ళ పాడు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన...**

**–శాసనసభ్యులు పాయం...**

ప్రజాదివాస్





అశ్వాపురం, సీతారామ ప్రాజెక్ట్‌లోని మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు.అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర్ రాజనరసింహ

**– ఉమ్మడి మెదక్ జిల్లా పీఏసీ సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీలపై విమర్శనాస్త్రాలు**

**– ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**





ప్రజాదివాస్

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ప్రధాన బలమని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు, పదవులు దక్కుతాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ స్పష్టం చేశారు.సోమవారం మెదక్ పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్ లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా పీఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశానికి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో ఏం చేశారో మాజీ మంత్రి హరీష్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలు, అవినీతి ప్రజలకు ఇంకా గుర్తున్నాయన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు, మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని సూచించారు.గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు నెలలో 20వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తోందని తెలిపారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు విషయంలో రైతులపై కేసులు పెట్టిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్ని ఉద్యోగాలు కల్పించారో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగించారని, కాంగ్రెస్ హయాంలో ఏర్పాటైన పలు కంపెనీలను అదానీ, అంబానీలకు అప్పగించారని ఆరోపించారు.తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని, అర్హులైన పేదలు ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద పిల్లల కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యత ఉందని, బీఆర్ఎస్ లో రాజయ్య, ఈటల రాజేందర్ వంటి నేతలను అన్యాయంగా తొలగించారని విమర్శించారు. పార్టీ నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ – ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ విషయంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం మంత్రి దామోదర్ రాజనరసింహ మాట్లాడుతూ.. తాము ఈ స్థాయిలో ఉన్నామంటే అందుకు కార్యకర్తల కృషే కారణమని, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, భవిష్యత్తులోనూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే లక్ష్యంతో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా తమ ఓట్లను తామే పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీకి నష్టం కలిగించే వర్గాలను ప్రోత్సహిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు.

# శ్రీ విద్యా సరస్వతి దేవాలయ శిఖర ప్రతిష్ఠాపనలో మున్సిపల్ చైర్మన్ మొహమ్మద్ యూనుస్

ప్రజాదివాస్




జహీరాబాద్‌లోని వెంకటరమణ కాలనీలో శ్రీ విద్యా సరస్వతి దేవాలయ శిఖర ప్రతిష్ట మహోత్సవం. జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్.మూర్ద్రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో హోమాలు, ప్రత్యేక పూజలతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.సరస్వతి దేవి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక ప్రేరణనిస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఆలయ సమగ్ర అభివృద్ధికి, వెంకటరమణ కాలనీ మున్సిపల్ అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్‌ను ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.హాజరైనవారు: కౌన్సిలర్లు జమ్మిలుద్దీన్, అక్రమ్, నామ రవికిరణ్, నాయకులు బర్కత్, షాబుద్దీన్, శేఖర్, వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు కాలనీ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మద్రి నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎన్నిక..!

ప్రజాదివాస్



కోహిర్ మండలం కవెల్లి చౌరస్తాలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మద్రి గ్రామ నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సువర్ణ మల్లన్న పటేల్, సర్పంచ్ వసంత అనిల్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేశారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా కిషోర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా పారుక్ పటేల్ను ఎన్నుకోగా, మరో 11 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సువర్ణ మల్లన్న పటేల్ మాట్లాడుతూ మద్రి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.నూతన కమిటీ పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/25/A0827
ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
25-08-2026

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం..



ప్రజాదివాస్
కామారెడ్డి జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.నూతన అధ్యక్షుడు కే. రంజిత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు బి. సంతోష్ కుమార్, పి.ఎన్. సాయి ప్రసన్న, సెక్రటరీ తులా శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కే. మధుకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్. శ్రీనివాస్, ట్రెజరర్ ఎస్. సాయిలు తదితర కార్యవర్గ సభ్యులు ఎస్పీని కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ అధికారుల సంక్షేమం, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పోలీస్ శాఖలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, అధికారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు.పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేస్తూ అధికారుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొంది.

# బిచ్కుంద 3వ వార్డులో నరకయాతన..

**-మురుగు నిల్వ, దోమల బెడదతో అల్లాడుతున్న ప్రజలు**

ప్రజాదివాస్
కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో పారిశుద్ధ్య సమస్యలు తారస్థాయికి చేరుకున్నాయి. మురుగు కాలువలు నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో కాలువలు చెత్తాచెదారంతో పూడిపోయి, మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీటి నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పరిసర ప్రాంతాల్లో నివసించలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆచూకీ లేని కౌన్సిలర్.. ప్రజల గోడు పట్టదా?ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిసిన స్థానిక కౌన్సిలర్.. గెలిచిన తర్వాత వార్డు సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వార్డులో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సిలర్ చొరవ చూపడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. సమస్యలపై ప్రశ్నించేందుకు ప్రయత్నించినా కౌన్సిలర్ అందుబాటులో లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.కాలువలు చెత్తాచెదారంతో కుదేలే..మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే కాలువలు పూర్తిగా పూడిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేక రోడ్లపైకి ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షం పడినా పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని చెబుతున్నారు. అధికారులు కనీసం కాలువల శుభ్రతపై కూడా దృష్టి సారించకపోవడం బాధాకరమని ప్రజలు అంటున్నారు.దోమల విజృంభణ.. విషజ్వరాల భయం కాలువల్లో రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. సాయంత్రం కాగానే దోమలు గుంపులు గుంపులుగా ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడదతో పిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో దుర్భర జీవితం ఇళ్ల ముందు, రోడ్ల వెంట నిలిచిపోయిన మురుగునీటి నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, ఇంటి తలుపులు, కిటికీలు తెరవలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పరిస్థితి మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించాలి బిచ్కుంద మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖాధికారులు ఇకనైనా 3వ వార్డుపై ప్రత్యేక



దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. వెంటనే మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు పూడికతీత పనులు చేపట్టాలని, నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. దోమల నివారణకు ప్రత్యేకంగా ఫాగింగ్ నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.స్పందించకపోతే
ఆందోళన"ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి 3వ వార్డులోని పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలి. మురుగు కాలువలను శుభ్రం చేసి, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలి. ప్రజల ఆరోగ్యంతో అధికారులు చెలగాటం ఆడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి. సమస్య పరిష్కారం కాకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతాం" అని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 21 ఫిర్యాదులు స్వీకరణ: జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**





రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 24 ప్రజాదివాస్
ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 21 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....
ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి.

**- క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై సమీక్షా సమావేశం .**

**- క్రిటికల్ కేర్ బ్లాక్ ను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**





ప్రజాదివాస్
రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు మెదక్ జిల్లా కేంద్రం లోని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ ను స్థానిక శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారితో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై ++ఎ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సునీత దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా నితిన్ కబ్రా, ఐవీనూ డా. జ్ఞానేశ్వర్, ఐజనూ డా. శివ దయాళ్, వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్ష లో ూజజ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హనుమంత రావు గార్లు పాల్గొన్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఎ= ఎక్విప్మెంట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ×ఎఖీవీూ సేవలను అందుబాటులోకి తేవడం పై రేపు (ఙవ. 25.08.2026) న హైదరాబాద్ సచివాలయం లో ఉన్నత స్థాయి సమావేశం కు రావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు అధికారులను ఆదేశించారు. అలాగే,++ఎ ఆసుపత్రి లో వైద్య సేవల బలోపేతం పై మంత్రి చర్చించారు. ++ఎ నూతన భవన నిర్మాణం పై చర్చించారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ నిర్మాణం పై చర్చించారు. తూప్రాన్ లో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్ లలో కిడ్నీ రోగులకు అందిస్తున్న డయాలసిస్ సేవలపై చర్చించారు. మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

# మంజీరా నది తీరం ఇరువైపులా ఫిఫ్త్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేయాలి

**- మరో ముంబై 3.0 లాగా అభివృద్ధి జరగాలి**

**- ఈ ప్రాంతానికి చెందిన మేధావులు, ఎన్ ఆర్ ఐ లు సహకరించాలి.**

**- జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగ జోగినాథ్**

ప్రజాదివాస్
అందోలు నియోజకవర్గం లోని మంజీరా నది పరీవాహక ప్రాంతంలోని బఫర్ జోన్ దాటి ఇరు వైపులా..10 వేల ఎకరాల్లో ఫిఫ్త్ ఫ్యూచర్ సిటీ ని ఏర్పాటు చేయాలి. రాజధాని హైదరాబాద్ కి సమీపం లో ఉన్న సుమారు 30 కి. మీ. పరిధిలోని మంజీరా తీర ప్రాంతం వెంబడి 8 లేన్ రోడ్డు అభివృద్ధి చేసి ఐటీ కారిడార్ ను ఏర్పాటు చేయాలి. దీనికి అదనంగా.. ఆ ప్రాంతాన్ని.. పర్యాటక (టూరిజం) కేంద్రంగా తీర్చిదిద్దా లి. తద్వారా.. వందలాది మంది మన ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన జరగడంతో పాటు, జోగిపేట, సంగారెడ్డి ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ఈ విషయమై, నేను పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రం సమర్పించాను. సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం, ఈ కారిడార్ ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలించి నివేదిక తయారు చేయమని..ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, పీయూష్ గోయల్ లు సంబంధిత శాఖల అధికారులకు.. లేఖ ద్వారా ఆదేశాలివ్వడం సంతోషకరం. ఈ ప్రాంతం మరో ముంబై 3.0 లగా అభివృద్ధి



చెందాలంటే..ఫిఫ్త్ ఫ్యూచర్ సిటీ కారిడార్ సాధనకు.. ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు....రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి వచ్చి ఈ ప్రాంత అభివృద్ధి లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నా. , దేశవిదేశాల్లో ఉన్న ఈ ప్రాంత మేధావులు, ఉద్యోగులు, ఎంట్రపెన్యూర్ లు కూడా సహకరించాలని కోరుతున్నాను.

# ఆర్మూర్ లో అత్యంత వైభవంగా జెండా బాలాజీ ఊరేగింపు



ప్రజాదివాస్
ఆర్మూర్ పట్టణంలో జెండా బాలాజీ ఆలయంలో జండా జాతర మరియు ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించి ఊరేగింపు ప్రతిష్ఠించిన జెండాను పట్టణ పుర వీధుల గుండా అంకాపూర్ గ్రామ శివారు వరకు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణతో ఊరేగింపు లో పట్టణ వీధులన్నీ ఏడుకొండల వెంకన్న స్వామి గోవింద నామస్మరణతో మారుమోగినాయి పూర్వీకుల ఆచారం ప్రకారం ఈ జండా జాతర మరియు పూజలను సర్వ సమాజ్ ప్రజా ఐక్య సమితి ఆలయ అర్చకులు కన్నుల పండువగా జరుపుతారు. భక్తులు తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు చేసి అంకాపూర్ గ్రామస్తులకు జెండాను అందజేస్తారు. ఊరేగింపు కార్యక్రమంలో సర్వ సమాజ్ మరియు తదితర కులాల సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణతో ప్రతి బూత్‌ను బలోపేతం చేయాలి

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు**

ప్రజాదివాస్
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) రెండో దశలో భాగంగా ప్రతి బూత్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, ఎస్ ఐ ఆర్ జిల్లా కన్వీనర్ రావు అమరేందర్ రెడ్డి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు డా.సిరంగి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు పరకాల స్వర్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన పరకాల అసెంబ్లీ నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ రెండో దశ కార్యశాలకు పరకాల పట్టణం, పరకాల రూరల్, నడికూడ, దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన బి ఎల్ ఎ -2లు, బూత్ అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.కాళీ ప్రసాద్ రావు, రావు అమరేందర్ రెడ్డి డా.సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో దశ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రతి బూత్‌ను రాజకీయంగా, సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపని వారిని గుర్తించి, అవసరమైన గుర్తింపు పత్రాలతో ఫారాలను పూర్తి చేయించి సమర్పించేలా ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా, ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా నిరంతరం పరిశీలన చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని పేర్కొంటూ, తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కృషి చేయాలని దిశానిర్దేశం



చేశారు. బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ అధ్యక్షులే పార్టీకి పట్టుకొమ్మలని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, అనర్హమైన మరియు బోగస్ ఓట్లను గుర్తించి తొలగించేలా సమగ్రంగా పరిశీలన చేపట్టాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసినప్పుడే రాజకీయంగా విజయాలు సాధ్యమవుతాయని, అందువల్ల ఎస్ ఐ ఆర్ సవరణ ప్రక్రియను కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని నాయకులు స్పష్టం చేశారు.

# మాజీ మంత్రివర్యులు బీసీ నేత కారుమూరి నాగేశ్వరరావు అక్రమ అరెస్ట్ ను ఖండించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు




ప్రజాదివాస్
రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేయడం అరెస్టులు చేయడం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే అది ఎన్నటికీ సాధ్యం కాదని మాజీ మంత్రి కారుమూరీ నాగేశ్వరరావు అక్రమ అరెస్ట్ ను ఆయన తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు కారుమూరి నాగేశ్వరరావు ఆరోపణలు ఉంటే చట్ట ప్రకారం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి గాని ఆరోపణలు రుజువు కాకముందే ఒక ప్రజాప్రతినిధిని దోషిగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అని అన్నారు ప్రభుత్వం అధికారాన్ని రాజకీయ కక్ష సాధింపులకు ఉపయోగించకుండా చట్టాన్ని అందరికీ సమానంగా వర్తింపజేయాలి ప్రతిపక్ష నాయకులపై వేధింపులు అక్రమ కేసులు అరెస్టులతో ప్రజాస్వామ్య గొంతుకలను అణచివేయలేరు అని తెలిపేరు కారుమూరి నాగేశ్వరరావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలు అండగా నిలుస్తారు అని అన్నారు బత్తుల రామారావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్నాడు జిల్లా బీసీ విభాగం పరిశీలకుడు

# జీలుగుమిల్లి పీహెచ్‌సీలో మెగా మెడికల్ క్యాంప్.

ప్రజాదివాస్
ఆశ్రమ హాస్పిటల్, ఏలూరు వారి సౌజన్యంతో రేపు అనగా 25-08-2026 తేదీన జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరం ప్రధాన ఉద్దేశం స్త్రీలలో సంభవించే గర్భకోశ సంబంధిత వ్యాధులు, గర్భాశయ క్యాన్సర్ మరియు రొమ్ము క్యాన్సర్ (బ్రెస్ట్ క్యాన్సర్) వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడం. ఇందులో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. దీర్ఘకాలికంగా గర్భకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న మహిళలను నిపుణులైన వైద్యులు పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు






నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి గైనకాలజీ మరియు రేడియాలజీ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు హాజరై సేవలందించనున్నారు. ఈ సందర్భంగా జీలుగుమిల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మణికంఠేశ్వర్ మరియు ఆశ్రమ హాస్పిటల్ సిబ్బంది పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ని మర్యాదపూర్వకంగా కలిసి, మెగా మెడికల్ క్యాంప్ ఉద్దేశాలను వివరించి, కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఈ వైద్య శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. జీలుగుమిల్లి మండలంలోని మహిళలందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మెగా మెడికల్ క్యాంప్‌ను విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# షేక్ సమీరాను పరామర్శించిన మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలా ప్రసాద్

ప్రజాదివాస్
నందిగామ పరిటాలలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన షేక్ సమీరా నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలా ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు బాలికతో పాటు తల్లిదండ్రులను ధైర్యంగా ఉండాలని సూచించారు అనంతరం ఆసుపత్రి వైద్యులను కలిసి సమీరా ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు మెరుగైన వైద్యం



కోసం ఎంఆర్ఐ స్కాన్ అవసరమని వైద్యులు సూచించడంతో సమీరాను అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి ఎంఆర్ఐ స్కాన్ కోసం తరలించారు రెండు రోజుల నుంచి టిడిపి నేత కొండూరు వెంకట్రావు దగ్గరుండి వైద్యం చూసుకున్నారు సమీరాకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహకారం అందిస్తామని అమ్మినేని జ్వాలా ప్రసాద్ కొండూరు వెంకట్రావు తెలిపారు

# ఒక డ్రైవర్ ప్రాణం పోయాడానికి,మరో డ్రైవర్ ప్రాణం తీయడం మంచిదేనా

ప్రజాదివాస్
డిస్టిక్ ఆటో సమస్య తీర్చడానికి మీకు మరో మార్గం కనబడలేదా - ఈ విషయం మీద మాలాంటి వాళ్లతో మాట్లాడాలని కూడా మీకు అనిపించలేదా

వెంటనే డిస్ట్రిక్ ఆటో సమస్య మీద ఆటో యూనియన్ సంఘాలు ఏవైతే ఉన్నాయో పునర్ ఆలోచన చేసి అందరికీ న్యాయం జరిగే విధంగా పరిష్కారం వెతకండి. అంతేకానీ ఒక డ్రైవర్ ప్రాణం కాపాడడానికి,మరో డ్రైవర్ ప్రాణం తీయకండి ఉదా. ఒకటి రెండు సమస్యలు చెప్తా వినండి రంగారెడ్డి సంగారెడ్డి మెదక్ మేడ్చల్ ఇలాంటి జిల్లాల నుండి హైదరాబాదులో ఉన్న అపోలో గాంధీ నిమ్స్ హాస్పటల్ లాంటిది ఎమర్జెన్సీ కేసులు రాత్రనకా పగలనకా తీసుకపోవాల్సి వస్తుంది మరి ఆ పేషెంట్లను తీసుకపోవడానికి సమయానికి బస్సు రాదు అంబులెన్స్ రాదు. ఎమర్జెన్సీగా ఆటోనే వెళ్తది. ఆ ప్రాంతా హాస్పిటల్ కి తీసుకెళ్లి వాళ్ళ ప్రాణాలను కాపాడుతుంది. ఇలాంటివి చెప్పుకుంటూ పోతే చాలా ఎమర్జెన్సీ సర్వీసులు ఆటో ఇస్తున్నది. మరి దీనికి విరుద్ధంగా మీరు తీర్మానం చేసినట్లు మాకు తెలిసింది. ఒక సమస్య పరిష్కారం చేయడానికి మరో సమస్యను సృష్టించొద్దు. ఇద్దరికి న్యాయం జరిగే విధంగా చూడాలి అదే పెద్ద మనుషుల లక్షణం. ఈ విషయం మీద మీరు పునర్ ఆలోచన చేసి అందరికీ న్యాయం జరిగే విధంగా చూడండని పటాన్చెరు లోని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర



ఉపాధ్యక్షులు ఎస్కే దస్తగిరి (చోటు) మాట్లాడుతూ అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగుడాల సాయిలు, ఎండి ఖాదర్, జార్జ్, రఫీ,రామస్వామి, రమేష్, రాజు, నాయక్, నర్సింలు, సురేష్ తదితరులు ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# స్వర్గీయ శ్రీనివాసరావుకు నివాళులర్పించిన ఎంపీ రవిచంద్ర



ప్రజాదివాస్
రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి,మాజీ ఎంపీ కే.ఆర్.సురేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,కొత్త ప్రభాకర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి తదితర ప్రముఖులు స్వర్గీయ జోగినిపల్లి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలుజల్లి ఘనంగా నివాళు లర్పించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు బావమరిది, శోభమ్మ తమ్ముడు శ్రీనివాసరావు ఈనెల 13వతేదీన మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన దశదిన కర్మకాండ సోమవారం కొంపెల్లిలోని ఆస్పిషియస్ కన్వెన్షన్ హాలులో జరిగింది. ఈ కార్యానికి ఎంపీలు రవిచంద్ర, పార్థసారథి రెడ్డి, మాజీ ఎంపీ సురేష్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరై స్వర్గీయ శ్రీనివాసరావు చిత్రపటానికి పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించారు,ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# నవనాథ సిద్ధుల గుట్ట పై శ్రావణ రెండవ పుణ్యస్థమైన సిద్దుల గుట్ట

ప్రజాదివాస్
ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్ట పైన ఎంతో పవిత్ర పుణ్యస్థలమైన శ్రావణ రెండవ సోమవారం నాడు భక్తులు ఉదయం నుండి అధిక సంఖ్యలు విచ్చేసి శివాలయంలో ఆ సిద్దేశ్వరునికి పంచామృతాలతో బిల్వపత్రలతో విశేషమైన అభిషేకాలు నిర్వహించడం జరిగింది. అలాగే రామాలయం దత్తాత్రేయ దుర్గ మాత అయ్యప్ప ఆలయలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు సిద్దుల గుట్ట పైకి రావడం జరిగింది. ఆశన్న రజిత రెడ్డి శివాలయంలో అభిషేకం నిర్వహించి రామాయణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవలో పాల్గొనడం జరిగింది శ్రావణ సోమవారం కావడం వల్ల భక్తులు ఉదయం నుండి దాదాపు పదివేల మంది పైగా భక్తులు రావడం జరిగింది విచ్చేసిన భక్తులందరూ ఆ సిద్దేశ్వరుని సీతారామచంద్ర స్వామి నీ దర్శించుకుని నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో సిద్దేశ్వరుని పల్లకి సేవ కార్యక్రమం చేయడం జరిగింది. భజన భక్తులు భక్తి పాటలు పాడుతూ స్వామి ముందర నృత్యాలు చేస్తూ ఎంతో భక్తి భావంతో పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మరి ఈ సోమవారం అన్నదాతలు వినోద్ లహరి మరియు రామకృష్ణ హర్షిని కుటుంబ సభ్యులు మరియు సిద్ధగుట్ట ఆలయ కమిటీ సభ్యులు భక్తులందరికీ ఆ స్వామివారి అన్న ప్రసాదం ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బి సుమన్ పి సి, గంగారెడ్డి చరణ్ రెడ్డి, కోడిగల మల్లయ్య,



జిమ్మీ రవి, కొంతం మంజుల మురళి, అలిశెట్టి నరేష్, బట్టు శంకర్, చందేశి శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్, రామా గౌడ్, సిద్దలగుట్ట శివ సమితి భక్తులు భజన మండల వారు భక్తులందరూ పాల్గొన్నారు.